క్లుప్తంగా

ఘనంగా అయ్యప్పస్వామి జయంతి



అయ్యప్పస్వామి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం స్వామివారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశేష పూజలు, అభిషేకాలు తదితర కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. అనంతరం అయ్యప్పస్వామి పల్లకీసేవ కొనసాగింది. సాయంత్రం 18 మెట్ల పడిపూజ కార్యక్రమం చేట్టారు. భక్తులు ఆలయాన్ని చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో అలయ కమిటీ సభ్యులు గడ్డం నాగేశ్వరరెడ్డి, మురళీ, వెంకటేశ్వర్లు, గజ్జెలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం వెలుగుతున్న వీధిలైట్లు



తిమ్మనాయినపేటలో పగలు వెలుగుతున్న వీధిలైట్

కొలిమిగుండ్ల: రేయి, పగలు తేడాలేకుండా గ్రామాల్లో వీధిలైట్లు వెలుగుతున్నాయి. విద్యుత్‌ను పొదుపుగా వాడుకొని ఆదా చేయాలని సంబంధిత అధికారులు చెబుతున్నా పల్లెల్లో మాత్రం 24 గంటల పాటు వెలుగుతూనే ఉన్నాయి. తిమ్మనాయినపేట, అంకిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో వీధిలైట్లకు థర్డ్ లైన్ ఏర్పాటు చేయక పోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. నాలుగైదు లైట్లకు ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయడం లేదు. థర్డ్ లైన్ ఏర్పాటు చేస్తే ఈసమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆయా గ్రామాల ప్రజలు, సర్పంచ్‌లు పేర్కొన్నారు.

సమాజసేవతో మానవ జన్మకు సార్థకత



మహా ప్రస్థానం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఈవీ సుజాత శర్మ

బేతంచెర్ల: సమాజసేవతోనే మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని పారిశ్రామిక వేత్తలు ఈవీ సుజాత శర్మ, శ్రీధర్ రెడ్డి, మారుతి శర్మ, పుల్లారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వికాస నిలయంలో పట్టణ వాసుల సౌకార్యర్థం దాతల సహకారంతో రూ. 2లక్షలతో సమకూర్చిన మహాప్రస్థానం వాహనాన్ని వారు ప్రారంభించారు. మహాప్రస్థానం వాహనం ఏర్పాటు దాతల సహకారం అభినందనీయమని వారు అన్నారు. మహాప్రస్థానం వాహనం కొరకు 9032828221, 9110572560 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రూప్ దేవాలయాల మాజీ కమిటీ సభ్యులు బుగ్గన విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక మంత్రి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్యాపిలి: మండల పరిధిలోని నల్లమేకలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రోషిరెడ్డి కుటుంబాన్ని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బుధవారం పరామర్శించారు. రోషిరెడ్డి కుమారుడు రామకృష్ణారెడ్డి వారం క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నల్లమేకలపల్లి సర్పంచ్ సంధ్య, డోన్ ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, డోన్ మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, న్యాయవాది నాగభూషణ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దిలీప్ చక్రవర్తి, బూరుగల శ్యాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక వృద్ధుడు మృతి



మృతి చెందిన తిమ్మయ్య

బేతంచెర్ల: పట్టణంలో నంద్యాల క్రాస్ రోడ్డు వద్ద 5వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. ఏఎస్‌ఐ లింగమయ్య వివరాల మేరకు బనగానపల్లె మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన కుంచెపు తిమ్మయ్య(78) పని నిమిత్తం బేతంచెర్లకు వచ్చి నంద్యాల క్రాస్ రోడ్డు ప్రక్కన ఉండగా ఆటో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడగా కర్నూలుకు తరలించారు. మృతుని కుమారు డు రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్ : చట్టసభలకు ప్రతినిధులను ఎన్నుకునేటప్పుడు అభ్యర్థుల గుణగణాలను పరిగణలోకి తీసుకుని ఓటు వేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రజలను కోరారు. ప్రత్యేకించి నేరచరితులను చట్టసభలకు దూరంగా ఉంచాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ బుధవారం స్థానిక సాయి శ్రీ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షత వహించగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూధన్, పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి తరుపున ఆయన ప్రతినిధి కుమారస్వామిరెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, డోన్, ప్యాపిలి ఎంపీపీలు రేగటి రాజశేఖర్‌రెడ్డి, గోకుల్ లక్ష్మి, జెడ్పీటీసీలు బద్దల రాజ్‌కుమార్, బోరెడ్డి శ్రీరాంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడతూ తెలుగుదేశం, ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న వారిపై అనేక క్రిమినల్, సివిల్ కేసులు ఉన్నాయన్నారు. ఇలాంటి వ్యక్తులను పెద్దల సభలో చట్టాలు చేసేందుకు ఎలా పంపగలమని ఆయన ప్రశ్నించారు. టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిపై కడప జిల్లాలో ఎనిమిదికి పైగా కేసులు ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ ఇలాంటి వ్యక్తులను చిత్తుగా ఓడించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నీతి, నిజాయితీగల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి, పశ్చిమ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఇతరులతో వేయించి గెలిపించాలని కోరారు. సమావేశంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌లు వెంకటేశ్వరరెడ్డి, గొల్ల చంద్రన్న, నాయకులు దిలీప్ చక్రవర్తి, శీలం భాస్కర్ నాయుడు, నాగభూషణంరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మల్యాల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్

అభివృద్ధికి పట్టం కట్టండి

డోన్ నియోజకవర్గం నుంచి గతంలో గెలిచి అనేక ఉన్నత పదవులు పొందిన వారు కేవలం తమ స్వార్థం కోసం రాజకీయ కక్షలను ప్రేరేపించి పబ్బం గడుపుకున్నారని మంత్రి బుగ్గన ధ్వజమెత్తారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ముఠా కక్షలు సమూలంగా నిర్మూలించడం జరిగిందని గుర్తు చేశారు. డోన్‌తో పాటు మిగిలిన ప్రాంతాలు అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్నాయన్నారు. ప్రజలు ఈ తేడాను గమనించి అర్హులైన వారిని ప్రజాప్రతినిధులుగా అందలం ఎక్కించి అనర్హులకు తగిన బుద్ధి చెప్పాలన్నారు.

అప్రజాస్వామికం

టీడీపీ నాయకులు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్ అన్నారు. స్థానిక సంస్థల కోటాలో పోటీచేస్తున్న తనకు స్పష్టమైన ఆధిక్యత ఉన్నా కుట్ర రాజకీయాలతో ఏకగ్రీవ ఎన్నికను అడ్డుకున్నారని విమర్శించారు. సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్ల సమస్యలు తాను గెలిచిన వెంటనే సీఎం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

నిరుద్యోగులకు అండగా ఉంటాం

వెన్నపూస రవీంద్రారెడ్డిని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించగలిగితే నిరుద్యోగులకు అండగా నిలుస్తారని, వారి బాధలు, ఇబ్బందులను చట్టసభల్లో వినిపిస్తా రని వెన్నపూస రవీంద్రారెడ్డి ప్రతినిధి కుమార స్వా మిరెడ్డి యువతకు హామీ ఇచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి యువకుల పక్షపాతి కాబట్టే అనేక ఉద్యోగ, ఉపాధి నోటిఫికేషన్లను జారీ చేశారని ఆయన వివరించారు.

మంత్రికి వెల్లువెత్తిన అభినందనలు

డోన్ : ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి బుధవారం అభినందనలు వెల్లువెత్తాయి. స్థానిక కొండపేటలోని ఎస్సీ, బీసీ వసతి గృహాల ఎదురుగా మూడు సెంట్ల ఖాళీ స్థలాన్ని ఉర్దూ ఘర్ కోసం కేటాయించేందుకు చొరవ చూపిన మంత్రిని మున్సిపల్ వైఎస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, షాదీఖానా కమిటీ అధ్యక్షుడు దస్తగిరి ఆధ్వర్యంలో ముస్లిం పెద్దలు స్థానిక స్వగృహంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. అదేవిధంగా రాష్ట్రంలో వాల్మీకులకు రెండు ఎమ్మెల్సీ స్థానాలతో పార్టీలో కీలక పదవులు అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ మంత్రి బుగ్గనను వాల్మీకి నాయకులు ఘనంగా సత్కరించారు. వాల్మీకి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం భాస్కర్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్ తదితర వాల్మీక నాయకులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

డోన్ పర్యటనకు వచ్చిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మహిళా కౌన్సిలర్లకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా కౌన్సిలర్లు ఇంథియాజ్, మిట్టా ఉమామహేశ్వరి, విమల, వెంకటేశ్వరమ్మ, సుమలత సురేష్, మౌశాభి, సుబ్బలక్ష్మి, ఉసేన్‌బీ, కళావతి, బుర్రు రమాదేవి, శ్రీలక్ష్మి, పాలుట్ల మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్రైవేటు వైద్యశాలను ప్రారంభించిన మంత్రి

స్థానిక కర్నూలు రోడ్డులో ఎద్దుపెంట సర్పంచ్ బంగారు జయచంద్ర ఏర్పాటు చేసిన ప్రైవేటు వైద్యశాలను మంత్రి బుగ్గన ప్రారంభించారు. కార్యక్రమంలో తాడూరు రంగనాథం, ఆవులదొడ్డి సర్పంచ్ మద్దిలేటి, రామదుర్గం సర్పంచ్ నాగన్న, యాపదిన్నె మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతులకు పాల బోనస్ పంపిణీ



మహిళలకు నగదు పంపిణీ చేసిన దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని శంకరాపురం విజయ డైరీ యూనిట్ పరిధిలో ఉన్న సిమెంట్ నగర్, బేతంచెర్ల, బుగ్గానిపల్లె గ్రామాల్లోని పాల కేంద్రాలకు సంబంధించిన పాడి రైతులకు బుధవారం సంస్థ అందజేసే పాలబోనస్ రూ.77, 433 పంపిణీ చేశారు. విజయ డైరీ శంకరాపురం మేనేజర్ మధుసూదన్ చేతుల మీదుగా బేతంచెర్ల శరబయ్య గ్రూపునకు రూ. 31,508, సిమెంట్ నగర్ భూలక్ష్మి గ్రూపునకు రూ. 23,935, బుగ్గానిపల్లె గ్రూపునకు రూ. 21,990 చొప్పున ఆయన పాడిరైతులకు అందజేశారు.

పట్టణంలోని హోలీ సంబరాలు

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్ల పట్టణంలో బుధవారం హోలీ పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. నాపరాళ్ల పరిశ్రమల్లో యజమానులు, కార్మికులతో పాటు బీహార్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన కూలీలు ఒకరికొకరు రంగులు పూసుకుంటూ కేరింతలు కొట్టారు. నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగులు చల్లుకుంటూ, మిఠాయిలు పంచి పెట్టారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

బేతంచెర్ల: నంద్యాల రహదారిలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం పాల్గుణ మాసం బహుళ పక్షం(స్వామి వారి జన్మ నక్షత్రం) సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, నూతనవస్త్ర అలంకరణ తదితర పూజల అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కొండమీదపల్లె అభివృద్ధికి కృషి



ప్రమాదకర మలుపును పరిశీలిస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: మండలంలో ప్రత్యేక గ్రామమైన కొండమీదపల్లె అభివృద్ధికి కృషి చేస్తున్నామని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. బుధవారం పంచాయితీ రాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యంతో కలిసి రోడ్డుకు రెండు వైపులా రక్షణ గోడ ఏర్పాటుకు పలు మలుపులను పరిశీలించారు. అధికారులతో కలిసి కాలి నడకన ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను పరిశీలించిన చైర్మన్ రోడ్డును విశాలం చేసి రక్షణ గోడ నిర్మాణంతో పాటు అక్కడక్కడ రైలింగ్ ఏర్పాటు చేసే అంశంపై అధికారులతో చర్చించారు. ప్రమాదకరమైన మలుపుల వద్ద కొండ భాగాన్ని కొంతమేర తొలగించాలని నిర్ణయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాదాపు 600 అడుగుల ఎత్తులో ఉన్న ఈ గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గొర్విమానుపల్లె–పెట్నికోట ప్రధాన రహదారి నుంచి రూ.93.70 లక్షలతో ఒకటిన్నర కిలో మీటర్ మేర తారు రోడ్డు నిర్మాణం చేపట్టామని గుర్తు చేశారు. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు జలజీవన్ మిషన్ పథకం కింద ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ మన్మథరావు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ దేవర



పెద్దమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లెరూరల్: మండలంలోని టంగుటూరు గ్రామంలో వెలసిన శ్రీ పెద్దమ్మ దేవరను గ్రామ రైతు సంఘం,పెద్దల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది. మంగళవారం అర్ధరాత్రి అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం దేవర క్రతువును సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. దేవర క్రతువు అయ్యాక గ్రామస్తులు అమ్మవారికి చీర, పసుపు, కుంకుమ, పండ్లతో పాటు నైవైద్యాన్ని సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబులరెడ్డి పెద్దమ్మను దర్శించుకొని పూజలు చేశారు. సీఐ సుబ్బరాయుడు, నందివర్గం ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన సంఘం అధ్యక్షులు గుండం నాగేశ్వరరెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్‌కుమార్‌రెడ్డి, సుబ్బలక్ష్మీరెడ్డి, పెద్ద శివారెడ్డి, హనుమంత రెడ్డి, ఎంపీటీసీ మహానందిరెడ్డి, హుస్సేని, కైప ప్రతాప్‌రెడ్డి, హరిష్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, అంబటి రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



పూజలందుకుంటున్న అమ్మవారు



గతంలో చిత్తడిగా ఉన్న ఓ వీధి



ప్రస్తుతం సీసీ రోడ్డు వేయడంతో కళకళలాడుతున్న వీధి

తీరిన బురద తిప్పలు!

ప్యాపిలి: దశాబ్దాలుగా సీసీ రోడ్లకు నోచుకోని గ్రామాలు ప్రస్తుతం సీసీ రోడ్లతో కళకళలాడుతున్నాయి. మండల పరిధిలోని ఎన్ రంగాపురంలో గతంలో ఏ వీధి చూసినా బురదమయంగా చిత్తడిగా దర్శనమిచ్చేవి. అడుగు తీసి అడుగు వేయాలంటే ఆలోచించే పరిస్థితి ఉండేది. సీసీ రోడ్లు వేయాలని ఎన్ని సార్లు అధికారులను కోరినా పట్టించుకునే వారు కాదు. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయి. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుండటంతో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఎన్ రంగాపురంలో రూ. 15 లక్షలతో కొత్తగా రెండు వీధుల్లో సీసీ రోడ్లు వేశారు. గ్రామ ప్రధాన రహదారి ఉంచి ప్రహ్లాదుడి ఇంట వరకు, ప్రధాన రహదారి నుంచి సీసీ రోడ్లు వేశారు. దీంతో పాటు గ్రామంలో ఇంకా మరి కొన్ని వీధుల్లో కూడా సీసీ రోడ్లు వేయనున్నట్లు సర్పంచ్ జెర్రిబండ సుబ్బారెడ్డి తెలిపారు.

పశు గ్రాసానికి భలే గిరాకీ!



నంద్యాల నుంచి వరిగడ్డి తీసుకొచ్చిన దృశ్యం (ఫైల్)

డోన్ టౌన్: పశుగ్రాసానికి భలే గిరాకీ ఏర్పడింది. డోన్ ప్రాంతంలో వేసవి ప్రారంభంలోనే పశు గ్రాసం కొరత వేధిస్తుంది. దీంతో నంద్యాల, బనగానపల్లె, కోవెలకుంట్ల ప్రాంతాల నుంచి రైతులు పశు గ్రాసాన్ని ఇక్కడికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. నంద్యాల ప్రాంతం నుంచి ఒక ట్రాక్టరు వరి గడ్డి రు.12 వేల నుంచి రు.15వేల వరకు ఖర్చు చేసి కొనుగోలు చేస్తున్నారు రైతులు. అలాగే బనగానపల్లె, కోవెలకుంట్ల తదితర ప్రాంతాల నుంచి ఒక ట్రాక్టరు మొక్కజొన్న సొప్ప రూ.10వేల నుంచి రూ. 12వేల వరకు విక్రయిస్తున్నారు. ఆ ప్రాంతాల నుంచి దాదాపు 80 కి.మీ తరలించడానికి ట్రాక్టరు బాడిగే అత్యధికంగా వస్తున్నందున అంత రేటు చెల్లించాల్సి వస్తోందని పశుగ్రానికి కంటే అధికంగా బాడుగ రూపంలో వెళ్తోందని రైతులు అంటున్నారు. పశుగ్రాసం రూ.4వేలు లేదా రూ. 5వేలు ఉంటే ట్రాక్టరు బాడిగే ఏడెనిమిదివేలు అవుతోందని రైతులు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా డోన్ ప్రాంతంలో వరి సాగుకు నీటి సౌకర్యం లేనందున ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. ఈ ఖరీఫ్‌లో బోరు బావుల కింద కేవలం 1,250 ఎకరాల్లో మాత్రమే సాగు అయినందున పశుగ్రాసం సమస్య తలెత్తిందని ఈ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

- సీనియర్ సివిల్ జడ్జి తంగమణి



మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని బుధవారం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఐసీడీఎస్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ విజ్ఞాన సదస్సు కమిటీ చైర్మన్ తంగమణి హాజరై మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ఇంకా మెరుగ్గా రాణించాలని పిలుపునిచ్చారు. సమాజం అభివృద్ధిలో మహిళల పాత్ర చాల ముఖ్యం అని గుర్తు చేశారు. మహిళలకు సంబంధించిన చట్టాల గురించి అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలన మహిళలతోనే సాధ్యం అన్నారు. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళల గురించి వివరించిన జడ్జి వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సుగుణమ్మ ఆధ్వర్యంలో జడ్జి తంగమణి, ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం, డాక్టర్ మాధవిలత, ఉపాధ్యాయిని శారదదేవి, జూనియర్ అసిస్టెంట్ ఉమాదేవి, లాయర్ కుమారిని ఘనంగా సన్మానించారు.

- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానికి ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న మహిళా డాక్టర్లను, సిబ్బందిని చేయూత స్వచ్ఛంధ సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు.
- జాడీల ఫ్యాక్టరీ ఆవరణంలోని బీపీ శేషారెడ్డి స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలను సత్కరించారు.
- స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం రామాంజనేయుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

కోవెలకుంట్ల: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ రహిమాన్ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కోవెలకుంట్ల మేజర్ గ్రామపంచాయతీతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పొదుపు మహిళలతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గృహహింస, బాల్య వివాహాలు, సాంఘిక దురాచాలు తదితర వాటిపై జడ్జి అవగాహన కల్పించారు. మహిళలు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని అందుకనుగుణంగా రాణించాలని పేర్కొన్నారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతను ఘనంగా సత్కరించారు. అలాగే స్థానిక వైఎస్సార్‌క్రాంతిపథకం కార్యాలయంలో ఏపీఎం గురుస్వామి ఆధ్వర్యంలో పొదుపు మహిళలు కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యాక్రమాల్లో ఏజీపీ తిరుపతయ్య, సీనియర్ న్యాయవాదులు మల్లికార్జునరెడ్డి, నరసింహ, శ్రీనివాసులు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం, మహిళా సంఘం అధ్యక్షురాలు వందన, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్యాపిలి: మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తే వారు ఆయా రంగాల్లో బాగా రాణిస్తారని ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటనాయక్, ప్రముఖ సాహితీవేత్త, రాచర్ల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తొగట సురేశ్ బాబు అన్నారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినీలు సుశీలమ్మ, ఉసేనమ్మ, జీవిత, ఇందిరమ్మ, రోషిణి, ప్రియాంక తదితరులను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళా సాధికారత అందరి కృషితోనే సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు చిన్నపరెడ్డి, రమేశ్ రెడ్డి, హాజీ మస్తాన్‌వలి, విజయ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక అమ్మవారిశాల్లో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు వాసవీ, వనితా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సూర్య బళ్లాని, గుప్త, లావణ్య, నాగమణి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులు కందగడ్డల మోహన్ రావు, బచ్చు సుబ్రహ్మణ్యం, లక్ష్మినారాయణ, సతీస్, రాజేంద్ర, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల సూరింటెండెంట్ డాక్టర్ సుజాత సూచించారు. స్థానిక ఎన్జీఓ కాలనీలోని ప్రియదర్శిని మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సుజాత మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు పురుషులతో సమానంగా అన్ని వ్యవస్థలో తమ ప్రతిభ చూపిస్తున్నారని, తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం విద్య, ఉద్యోగ, రాజకీయ, కాంట్రాక్ట్ రంగాల్లోనూ మహిళలకు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ముగ్గుల పోటీల్లో ప్రతిభకనబరచిన మహిళలకు ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షురాలు విజయలక్ష్మీతో కలిసి డాక్టర్ ప్రోత్సాహక బహుమతులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయిని సుబ్బలక్ష్మమ్మ, సోషల్ వర్కర్ మహేంద్ర, మహిళా మండలి సభ్యురాలు హైమవతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్



ఉపాధ్యాయినులను సన్మానించిన దృశ్యం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత